
# సమాధానం



మోదు రాజేశ్వరరావు



"డాడీ!"

"ఏంటమ్మాయ్!"

'ఇవ్వాళ"

"ఆ ఇవ్వాళ"

"మరేమో మా టీచర్ కాంపోజిషన్ నోట్ బుక్ కొనుక్కురమ్మన్నారు."

"అలాగా."

"మరి మాక్కూడా ఫీజుకట్టేందుకు ఆఖరి రోజు డాడీ."

"అలాగామ్మా..... అయితే వెళ్ళి మీ మమ్మీనడగండి తల్లులు. నా దగ్గర మూటలేంలేవు మీ తాత నాకు మిగిల్చిందిలేదు.... మీ అమ్మ నా దగ్గరకి పట్టుకొచ్చిందిలేదు" వంటింట్లోవున్న సావిత్రికి వినిపించేట్టు గట్టిగా అరిచాడు. పాపం పిల్లలకి అర్థంకాక అలాగే వుండిపోయారు బిక్కమొహాలువేసుకుంటూ.

"వెళ్ళండి వెళ్ళి మీ మమ్మీ దగ్గర ఏడ్వండి" అంటూ కాఫీ కప్పును టేబిల్ మీద విసురుగాపెట్టాడు సుందరం.

ఆ కేకకి పిల్లలు అదిరిపడి పారిపోయారు దూరంగా.

సావిత్రి వంటింట్లోనుండి బయటికి వచ్చింది. సుందరం బూట్లువేసుకుంటూ తల పైకెత్తి "ఏం...... ఏం కావాలి?" అన్నాడు.

"ఎందుకండీ అనవసరంగా వాళ్ళని తిడతారు?"

"ఏం అంత పౌరుషం వొచ్చిందా - వాళ్ళనంటె.... అంత పౌరుషమేవుంటే ఇంకా రావలిసినదంతా తెచ్చిపెట్టమను" గట్టిగా అరిచాడు సుందరం.

"ఇంకా వాళ్ళదగ్గిరేవుంది...పాత ఇల్లు తప్ప. అయినా మీకేం తక్కువచేసారు యాభైవేలు నగదు, స్కూటర్, కలర్ టీవి.... ఇవన్నీ చాలకనా ఇంకా వాళ్ళ మీదపడి ఏడుస్తున్నారు" సావిత్రి గబగబా దండకం చదివింది.

"అవన్నీ పెట్టారనేగా నీ కింత అహంకారం?"

"అహంకారం అంటె నాకు తెలిసుంటే నే నిన్నికష్టాలు పడివుండగలనా?"

"అంటే?"

"మీ కర్థంకాదులెండి!"

"సర్లే ఎలాగోఏడు... నాకాఫీసుకు టైం అవుతుంది... సాయంత్రం రావడం ఆలస్యం అవుతుంది......బహుశా రాత్రికూడా కావచ్చు వస్తాను" సుందరం స్కూటర్ వీధిలోవున్న దుమ్మును సావిత్రీమీదకు విరజిమ్ముతూ బర్రున ముందుకుసాగింది.

పారిపోతున్న సుందరంవైపు చూస్తూ అలావుండిపోయి ఆలోచనల విహారం చేసింది సావిత్రి గుమ్మంలోనే.

ఆరేళ్ళక్రితం సుందరం సావిత్రి అందమైన నవదంపతులు. పాపం ప్రస్తుతం అందవిహీనులైన వయోదంపతులు. సుందరంకి డబ్బంటే పిచ్చి కాని ఉద్యోగంచేస్తున్న సావిత్రిని అభిమానంతో మానెయ్యమన్నాడు. ఆడదాని సంపాదనతో బ్రతకడం యిష్టంలేదన్నాడు. అందులోనూ భార్య సంపాదనమీద, పాపం సావిత్రి కాదనలేకపోయింది. మానేసింది.

ఆమె చదువుకున్న ఎం.ఏ; బి.ఇడి. నిరర్థకంఅయింది. నాలుగేళ్ళు తిరిగాక ముగ్గురుపిల్లల తల్లైంది.

ఇద్దరుపాపలు, ఓ బాబు. సంసారం ఈదలేక సుందరం అపుడపుడు వెర్రికేకలు వేస్తుంటాడు. తనకొచ్చిన జీతం చాలదంటూ తలకిందులుగాపడి చిందులుతొక్కుతుంటాడు. ఆ సందర్భంలోనే సావిత్రి అమ్మగారిమీద కూడా అపుడపుడూ విసుర్లు, విరసాలు, అది ముదిరిపోయి ఈమధ్య యింటికి రావడం ఆలస్యంగానే వస్తున్నా అదొక్కటైనా సహించేది పాపం సావిత్రి. దానికితోడు కాస్త బలం మందు... ఆ రాత్రంతా సావిత్రికి పిల్లలకి జాగరణ - అందరూ ఏవనుకున్నా ఫర్వాలేదనుకొనే సుందరంకి, సావిత్రి ఆ విషయంలో పూర్తి వ్యతిరేకి.... పాపం అందుకే అందమైన సంసారం ఇలా......

"మమ్మీ స్కూల్‌కి టైం అయ్యింది. టిఫిన్ పెట్టు" పెదపాప కేకతో ఈ లోకం లోకివచ్చింది సావిత్రి.

పిల్లలందరికి అన్నీ అందించి స్కూలుకి పంపించింది. తను సంసారసముద్రంలోకి దూకింది. సరిగ్గా పదిదాటింది పాపం ఆరోజు

**టానా-ఆంధ్రసచిత్ర వార పత్రికల సంయుక్త సాహితీ సంబరంలో రు.500/- బహుమతి పొందిన కథ**

నావ ఎక్కేసరికి!

* * * * * * *

"ఏవిటి సుందరం ఎపుడుచూసినా వర్రీస్ వర్రీస్ అంటావ్?" సత్యం అడిగాడు.

"అవును నిజంగానే వర్రీస్..... గవర్నమెంటువారిచ్చే ఈ రెండువేలు జీతం ఏం సరిపోతుందిరా మా సంసారానికి. ముగ్గురు పిల్లలు....వాళ్ళ చదువులు...." సుందరం చదవబోయాడు.

"ఏంరా అందరికీ అదే జీతం వస్తుందిగా మరి మేం ఎలావున్నాం. అయినా శుభ్రంగా వుద్యోగంచేస్తున్న మా చెల్లాయిని ఆ పాటు మానెయ్యమన్నావ్. ఆమె ఎంతో కొంత తెస్తుందిగా. నీక్కాస్తా...."

"ఆవిడ వుద్యోగంచెయ్యడం నా కిష్టం లేదురా."

"ఏం? ఎందుకని?"

"ఆడవాళ్ళ సంపాదనతో మనం బ్రతకడం....."

"మనకి చేతకాదన్నపుడు... ఆమె సహకారం, సహాయంపొందడంలో...."

"నా కిష్టంలేదురా."

"ఆమెకి ఆ అర్హతలున్నాయికదరా."

"అయితే"

"సుందరం నువ్వు చాలా పొరబడుతున్నావ్.... భార్య అంటె మనతో కలసి సంసారజీవనంచేస్తూ మనకి వండి వడ్డించే యంత్రంగా మలచకూడదు. ఆమె యింటిలో సహధర్మచారిణి అనుకున్నా నీకు సంపాదనలో సహాయకారిగా ఎందుకనుకోకూడదు?"

"సారీ నేననుకోలేను.... సరేకాని ఓ ఫిఫ్టీవుంటే యివ్వు."

"ఎందుకు.... బార్‌కేనా.... లేకపోతే పేకాటకా..... లేదా సాయంత్రం ఆ సరోజతో బీచ్‌కా.... ఎందుకురా నీకీ వ్యసనాలు సుందరం?"

"బాధలు.... బాధలు తట్టుకోలేకనేరా సత్యం!"

"బాధలుపడుతూ వ్యసనాలకిలోనైనవాడు యిలా చెబుతాడు. నామాట విని యివన్నీ మానుకుంటే నీ సంసారం హాయిగా......"

మాట పూర్తికాకముందే సుందరం పారిపోయాడు సరోజ టేబుల్ దగ్గరకి!

* * * * * * *

రాత్రి పదిగంటలు దాటింది. సావిత్రి భోజనంచెయ్యకుండా సుందరంకోసం మేడ మీద మంచు కురుస్తున్నా అలా నిల్చుంది. పిల్లలంతా హాయిగా నిద్రపోతున్నారు.

సావిత్రికి యిదేం కొత్తకాదు. ఆమెకు ఆ జీవనం అలవాటై దాదాపు రెండేళ్లైంది.

దూరంగా ఏదో స్కూటర్ వస్తున్న శబ్దం. లైటుకూడా లేదు. సుందరం అనుకుంది. గబగబా క్రిందికివెళ్ళి తలుపుతెరిచింది.

వచ్చింది సుందరం. స్కూటర్ స్టాండ్ వెయ్యబోయి తూలాడుగభాల్న. సుదరమే తమాయించుకొని ముందుకొస్తున్న సావిత్రిని కోపంగా చూసాడు. సుందరం కళ్ళు ఎర్రగా



శ్రీ మోదు రాజేశ్వరరావు

శ్రీ మోదు రాజేశ్వరరావు 'సమాధానం' కథానిక రచయిత. జననం, చదువు, షిప్‌యార్డులో చిరుద్యోగం అన్నీ విశాఖపట్టణంలోనే. జన్మదాతలు శ్రీ మోదు గురుమూర్తి, సత్యవతులు. తనను పరిచయం చేసుకుంటూ:

"వివిధ సాహిత్య ప్రక్రియలు చేస్తున్నప్పటికీ, కార్టూన్లు, చిత్రాలు గియ్యడం అంటే చాలా యిష్టం! రాజా పేరుతో కార్టూన్లు నా విప్లవాన్ని చెబుతాయి! నాకు ఎన్ని బహుమతులు లభించినా...నావి ఎన్ని రచనలు ప్రచురించినా...ఈ బహుమతి నేనెప్పటికీ మరువను, ఎందుకంటే నా రచనలన్నింటిలోను ఎక్కువ (కార్టూన్లు, కవితలు) ఈ ఆంధ్ర సచిత్ర వార పత్రికలోనే వచ్చాయి కనుక. అందుకే నేనెప్పటికీ వీరికి కృతజ్ఞుణ్ని! "అక్షర లక్షలు", "అక్షరోదయం" నా కవితా సంపుటాలు" అంటున్నారు.

వున్నాయి. మాట్లాడకుండా ఆమెను, తమె రాకను గమనించకుండా లోపలికి వెళ్ళిపోయాడు తూలుతు. సావిత్రి తలుపేసింది. లోనికివస్తూనే "ఏవండీ భోజనంచెయ్యరా?"

"ఉ........"

"భోజనం."

"నాకు భోజనం అక్కర్లేదు. ఎక్కడ పిల్లలెక్కడే...చెప్పు."

"పిల్లలు నిద్రపోయారండి. మీరు భోజనంచెయ్యండి."

"నేనిన్నానన్నా వినిపించలే."

"ఇలాఅయితే ఎలాఅండి... మీరు యిలా వున్నపుడు కనీసం....."

"ఇలావున్నానా..... ఎలాగే" అంటూ సావిత్రి జుట్టుపట్టుకొని - "ఇలాఅంటె తాగాననా నీ వుద్దేశ్యం....స్కౌండ్రల్ - ఫూల్" అంటూ గట్టిగాకొట్టాడు. సావిత్రి దూరంగా వెళ్ళిపడిపోయింది.

కళ్ళనుండి నీళ్ళు నదులుగాపారాయి. అక్కడేవున్న టీపాయ్అంచు నుదుటికి తగిలి రక్తం చిమ్మింది.

"నన్ను నన్ను - తాగుబోతు అంటావా?"

"లేదండి అన్లేదు.... మీరు నామాట విని పడుకోండి ప్లీజ్ - పిల్లలు లేచిపోతే భయపడతారండి" అంటూ పిల్లలుపడుకున్న గది వైపు చూసింది. అంతే కొయ్యబారిపోయింది పాపం సావిత్రి. అప్పటికే పెదపాప, చినపాప నిద్రలోంచి లేచి గుమ్మంపట్టుకొని ఏడుస్తున్నారు.

ఇదంతాపట్టని సుందరం బెడ్రూంలోకి వెళ్ళి మంచంమీద వాలాడు. సావిత్రి తలకితగిలిన దెబ్బైనా చూసుకోకుండా పిల్లల్ని పడుకోబెట్టడానికి వెళ్ళింది వాళ్లగదిలోకి.

సుందరం కేకలేస్తున్నాడు "సావిత్రి.... సావిత్రి కమ్హియర్."

సావిత్రి పరిగెట్టింది. "ఏంకావాలండి?"

# సమాధానం

సుందరం కాళ్ళదగ్గర నిలబడి అడిగింది.

"నువ్వే సావిత్రి కమ్." అంటూ మంచంమీద పడుకోమన్నాడు. సావిత్రి ఆయనపక్కకు చేరింది.

ఆతనిచేతులు ఎలుగుబంటి చేతుల్లాగా ఆమెను ఆవహించుకున్నాయి. ఆమెను చిత్రహింసలుచేస్తున్నా పాపం ఆ కంపును భరిస్తు సావిత్రి శవంగా మారి కళ్ళను నీళ్ళతో నింపుకుంది. ఓ గంటదాకా ఆ మృగవాంఛకు బలైంది సావిత్రి. ఆ తర్వాత పాపం లేచిచూసేసరికి సుందరం నిద్రపోతున్నాడు. సావిత్రి మంచంమీదనుండి లేచి పిల్లలదగ్గరకు వెళ్ళింది. కుళ్ళికుళ్ళి ఏడుస్తూ ఆ రాత్రి గడిపింది.

* * * * * * *

"సావిత్రి.... సావిత్రి...." ఇలాంటి పిలుపు పెళ్ళైనకొత్తలో వింది. మళ్ళీ యిదే వినడం సుందరం నోటివెంట. ఆ పిలుపులో ఎంతో అభిమానం కనిపించి ఆనందంతో పరుగులుతీస్తూవచ్చింది. "ఏవండీ పిల్చారా?"

"సావిత్రి రాత్రి జరిగిందాన్ని మర్చిపోతానని మాటివ్వు... నో నో నన్ను క్షమించానని అను సావిత్రి."

"అబ్బెబ్బె అవేం మాటలండి. నేను మిమ్మల్నిక్షమించడం ఏవిటండి....రండిరండి స్నానంచేసి కాఫీ తీసుకుందురుగాని" సావిత్రి పొంగిపోతూ అంది.

"నువ్వు క్షమించానంటేనే నేనన్నీచేసేది."

"అయ్యో క్షమించాను."

"ఓ.కే..." అంటూ సుందరం బాత్రూంవైపు పరిగెట్టాడు.

సుందరంలో పాత సుందరాన్ని చూసింది సావిత్రి. ఎంతో సంతోషంకల్గింది ఆమెకు. పిల్లలుకూడా చదువులు ఆపేసి ఆమెవైపు అలా చూస్తూవుండిపోయారు.

"సావిత్రి నే రెడీ. కాఫీ ఏది?"

"అపుడే స్నానం అయిపోయిందా! భలేవారే. ఉండండి తెస్తాను." అంటూ వంటగదివేపు పరుగుతీసింది.

"ఒరే మీరు బాగా చదువుకోవాలి. చదువుకుంటె మీకన్నీ కొంటాను. ఓ.కే."

"ఇదిగోండి" సావిత్రి కాఫీ అందించింది.

కాఫీ తాగుతూ "సావిత్రి ఓసారిలా రా" అంటూ లేచి వరండాలోకి తీసుకువెళ్ళాడు.

"ఏంటండీ విశేషం?"

"ఏంలేదు. నీకో విషయం చెప్పాలి."

"ఏమిటది?"

"మన సంసారం గడవడం చాలాకష్టంగావుంది కదూ. అందుకు మన ఆర్థికపరిస్థితేనని నీక్కూడా తెల్సుననుకుంటాను."

"అయితే నన్ను మళ్ళీ ఉద్యోగం చూసుకోమంటారా?" సావిత్రి ఆత్రం.

"అబ్బెబ్బె. అదంత సులువుగా దొరుకుతుందా.... దొరికినా ఏ మూడొందలో - నాలుగొందలో యిచ్చే ఉద్యోగం వస్తుంది. పైగా నా డియర్ని కష్టపెడతానా?" అంటూ బుగ్గగిల్లాడు.

"అయితే ఏవంటారు?"

"అబ్బే ఏంలేదు. మా ఆఫీసులో సరోజ అని ఒకామెవుంది. ఆమెకు ఎవరూలేరు. తనొక్కత్తేవుంది. ఆమెకు నెలకు మూడువేలు జీతం... ఆమెను మన ఇంటికి తెచ్చుకుంటె ఎలావుంటుందంటావ్?"

సావిత్రి నిశ్చేష్టురాలైంది. పాతాళానికి విసిరేసినట్టనిపించింది. హృదయాన్ని ఎవరో పిండుతున్నట్టనిపించింది. కళ్ళవెంబడి నీళ్ళు ఏరులైపారాయి. "ఏవండీ.... మీరు..... మీరు...."


"ఎస్. నేనే. నాకుతెలుసు ఈ విషయంలో నీ నోట మాట రాదని."

"ఏవిటి మాట్లాడుతున్నారో ఒళ్ళుతెలిసే అంటున్నారా?" సావిత్రి గర్జించింది.

పరిస్థితిని గమనించిన సుందరం ఆమె పీకమీద తన రెండుచేతులు వేసి "డియర్ సావిత్రి.... ఇది నా తుది నిర్ణయం. అరిచినా లాభంలేదు. సాయంత్రం ఆమెను....నో.... మంచిరోజుకాదు. రేపే ఆమెను తీసుకొస్తాను. బైదిబై... ఈ సాయంత్రానికి నీకు టైంయిచ్చాను. వస్తాను" విసురుగా పారిపోయాడు స్కూటర్మీద.

వదిలిన మెడను రెండుచేతులతోను పట్టుకుని కుమిలిపోయింది సావిత్రి. పిల్లల రాకను గమనించి "పదండి పదండ్రా స్కూలుకి" అంది మెల్లగా.

* * * * * * *



# యువతా! కవితా!!

## కళామయం జీవనం

యంత్రం కాదు మనిషి
కేవలం కాలంతో
పరిగెత్తడానికి!
రుషి కాదు మనిషి
కేవలం తపస్సులో
గడపడానికి!
జీవితాన్ని కళల తేనీటిలో ముంచి
రసానందంలో తన్మయించే
రసపిపాసి మనిషి!
కళ వెన్నెలైతే
మనిషి చంద్రుడు!
కళ కోకిల గానమైతే
మనిషి వసంతం!
మానవతా సౌధానికి
కళే పునాది!
కళ ఉప్పొంగిన
తరంగమైతే
మనిషి ఓ సముద్రం
మనిషి ఓ పుష్పం
కళ పరిమళం! -దిట్టకవి

## మృత్యువు

సుఖాల
తీరాల నుండి
దూరం చేస్తుంది!
అయితేనేం?
కష్టాల
కంటకాల నుండి
కడ తేర్చుతుంది!!

-వాసాల నరసయ్య

## కొలబద్ద

తల్లి ఒడినిదాటి
వీధిబడిలో వాలాను
కుడిపాదం పెట్టమంటూ
"కులమేది?"
'ఓం నమః' అంటూ
"మతమేదీ?"
"శివాయః" దిద్దిసూ_త్త

"షెడ్యూల్డా? ఫార్వర్డా?"
కురిపించారు ప్రశ్నల వర్షం!
ఆ వయసులో అర్థం కానిది
జీవన ప్రయాణంలో తెలుసుకున్నది
ఆ ప్రశ్నల యొక్క ప్రాముఖ్యం
తెలివి తెచ్చిన గోల్డ్‌మెడల్
తాకట్టుకు కూడా పనికిరాదంటే
తహసిల్దారిచ్చే కులపత్రం
తరతరాలకు తిండిపెడ్తానంటోంది

అందుకే
చదువుకు కొలబద్ద
కాదిక "జ్ఞానం"
పుట్టిన "కులం"!

–శింగరాజు శ్రీనివాసరావు

## వార్తలు కరువయాయి

పిల్లి జాగిలాన్ని కరచి
కండ ఎక్కపీకిందంటే
......అది వార్త!

ఎలుకలన్నీ కలిసి
గండుపిల్లిని రక్కి చంపాయంటే
......అది వార్త!
తనను మ్రింగటానికి తెరచిన
కొండచిలువ నోట్లోకి
కప్పకత్తి విసిరిందంటే
......అది వార్త!
తన గూట్లో కోకిల పెట్టిన
గ్రుడ్లని పొదగకుండా
కాకి కాలితో తన్నేసిందంటే
......అది వార్త!
పేరుకే అన్నీ వార్తాపత్రికలు కాని
వాటిలో వాస్తవానికి వార్తలుండవు
చేవచచ్చిన జనంలో చైతన్యం లేనిదే
వార్తలెలా పుడతాయి?

-పుట్రేవు రాఘవేంద్రరావు

## ప్రే(దో)మ

దోమ
కుడితే
బోదకాలు!
ప్రేమ
కుడితే
జీవితానికి
తిలోదకాలు!!

–కవిబాబు

సాయంత్రం ఆరైంది. సుందరం స్కూటర్ జర్రున ఇంటిముందాగింది.

పిల్లలు గుమ్మంలో ఆడుకుంటున్నారు. స్టాండ్ వేసి ఇంట్లోకివెళ్ళాడు. పెదపాప మెల్లగా వెనకాలేవెళ్ళి "డాడీ మమ్మీ లేదు."

"లేదా! ఏం ఎక్కడికెళ్ళింది?"

"తాతయ్యావాళ్ళింటికి."

"ఇప్పుడొచ్చేస్తానందా?"

"ఏమో. అదిగో టేబిల్‌మీద ఏదో లెటర్ పెట్టింది. మిమ్మల్ని తీసుకోమంది." అంటూ మళ్ళీ వీధిలోకి పారిపోయింది పెద పాప. సుందరం ఆతృతగా ఉత్తరం అందుకున్నాడు.

"డియర్ సుందరం! అందమైన మన ఆరేళ్ళ కాపురం చాలా ఆనందంగా ముగుస్తుంది. అందుకు నీవు తీసుకున్న నిర్ణయం చాలా చక్కటి ముగింపునిస్తుంది. కేవలం డబ్బుకోసం మీ రంతటి నిర్ణయం తీసుకోవడం, అదీ నేను కష్టపడకుండా సంసారం సాగేందుకు మీ ఆలోచన అభినందనీయం. కానీ నీ నిర్ణయం అవునో కాదో అంటె ఒప్పుకోవాలో మానాలో నే నాలోచించుకోవడానికి మీరీ సాయంత్రం గడువిచ్చారు. అంతకులోపే నాకు మరో మంచి ఆలోచనతట్టింది. ఆ ఆలోచనకూడా మన సంసారం పండువెన్నెల్లో మంచుతల్పంలాగా సాగేందు కుపకరిస్తుంది. నీవాసించినట్టే నేనుమాత్రం కష్టపడకుండా ఆదాయంవచ్చే అద్భుతమైన ఐడియా...... ఏంలేదు. మన కాలనీలో ఓ మేజరున్నాడు. ఆయనకి నెలకి దాదాపు ఐదారువేలు వొస్తుంది. మనం ఆయన్ని మనింటికి తెచ్చుకుంటె ఎలావుంటుంది? నేను రమ్మంటె కాదనడు. పిలవమంటారా? అదే తెచ్చుకుందాం....పాపం ఆయనకీ ఎవరూలేరు..... పైగా మీరు తీసుకురాబోయే సరోజ ఆదాయం కేవలం మూడువేలు - మరాయనకు ఐదారు వేలు... ఆలోచించండి....ఏ విషయం మాయింటికివచ్చి చెప్పండి.

మీ సావిత్రి"

సుందరం కళ్ళు బైర్లుకమ్మాయి. లోకం పచ్చగాకనిపించింది. రెండుచెంపలమీదా సావిత్రి తన రెండుచేతులతోను ఎడాపెడా కొడుతున్నట్టనిపించింది. అంతే ఆ ఉత్తరం క్రిందపారేసి స్కూటర్‌దగ్గిరికి పరిగెట్టాడు.

"డాడీ మళ్ళీ ఎక్కడికి?" అడిగింది పెదపాప.

"ఆ....పాపా....మమ్మీని తీసుకొస్తాను... ఇపుడేవస్తాను." స్కూటర్ ఎక్కుతూ పాపకి సమాధానంచెప్పాడు.

పిల్లలు "మమ్మీనా?
కమ్‌సూన్ డాడీ" అని అరిచారు.

సుందరం కళ్ళనీళ్ళు గమ్మునపైకి వచ్చాయి.

అంతే! సావిత్రి పుట్టింటివైపు స్కూటర్ పరుగుతీసింది అప్రయత్నంగా.

○